సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం : 23 : జూన్ : 2023
I





మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ బస్టాండు



ప్రారంభోత్సవ ఆహ్వానము



ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా..

"మేకపాటి కుటుంబం" వారు **మేకపాటి గౌతమ్‌రెడ్డి ఫౌండేషన్**
(MGR ఫౌండేషన్) ద్వారా దివంగత **మేకపాటి గౌతమ్‌రెడ్డి గారి** జ్ఞాపకార్థం
తమ స్వంత నిధులు 4.50 కోట్ల రూపాయలతో ఆత్మకూరు పట్టణములో
అత్యాధునికంగా, అధునాతనంగా, సర్వాంగ సుందరంగా నిర్మించిన

మేకపాటి గౌతమ్‌రెడ్డి మున్సిపల్ బస్టాండు ప్రారంభోత్సవం


కీ.శే. శ్రీ **మేకపాటి గౌతమ్‌రెడ్డి** గారి **విగ్రహ ఆవిష్కరణ** మరియు
ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ADF) "WEBSITE" ఆవిష్కరణ

తేది. 23.06.2023 శుక్రవారం సాయంత్రం : 5.00 గంటలకు


ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్న ముఖ్య అతిథులకు, ఆత్మకూరు నియోజకవర్గ ప్రజానీకానికి

స్వాగతం.. సుస్వాగతం...





మేకపాటి
విక్రమ్‌రెడ్డి
శాసనసభ్యులు
ఆత్మకూరు



మేకపాటి
రాజగోపాల్‌రెడ్డి
వైఎస్ఆర్‌సిపి
నాయకులు



మేకపాటి
రాజమోహన్‌రెడ్డి
మాజీ పార్లమెంట్
సభ్యులు

ATMAKUR
DEVELOPMENT FORUM

క్లుప్తంగా

ఈనాడు ప్రతినిధులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

- కోర్టు ఆదేశాలతో నమోదు చేసిన వేదాయపాళెం పోలీసులు

సాక్షి, నెల్లూరు ప్రతినిధి: నెల్లూరు ఐదో అదనపు మొదటి తరగతి కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు నలుగురు ఈనాడు ప్రతినిధులపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో నివాసం ఉంటున్న కె.రమేష్ 2021–22 సంవత్సరంలో నుడా వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 'నుడాలో అక్రమాలు' పేరుతో ఆ పత్రికలో 2022 మే, జూన్ నెలల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దళితుడైన తన ప్రతిష్టను దిగజార్చే విధంగా ఈనాడు ప్రతినిధులు తప్పుడు సమాచారంతో అసత్య కథనాలు రాసి, ప్రచురించారని వారిపై చర్యలు తీసుకోవాలని రమేష్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో వేదాయపాళెం పోలీసులు ఈనెల 21వ తేదీన ఈనాడు డిజిటల్ డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్ శివ, యూనిట్ మేనేజర్ వీరబాబు, డెస్క్ ఇన్‌చార్జి సురేష్‌బాబుతోపాటు బాలభాస్కర్‌పై 499 ఐపీసీ ఆర్/డబ్ల్యూ 156(3) సీఆర్‌పీసీ, 3(1)(ఎం), 3(1)(ఆర్), 3(1)యూ ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): జిల్లాలోని మర్రిపాడు మండలం కృష్ణాపురంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు గురువారం ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 19 కేంద్రాల్లో పరీక్ష జరిగిందన్నారు. అడ్మిషన్ దరఖాస్తులను నేరుగా నవోదయ విద్యాలయంలో పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు హెల్ప్‌డెస్క్ నంబర్‌ను 89850 07588ను సంప్రదించాలని కోరారు.

పంట కాలువలో మహిళ మృతదేహం

కొడవలూరు: మండలంలోని గండవరం శివారులో పంట కాలువలో ఓ మహిళ మృతదేహాన్ని గురువారం గుర్తించారు. కొడవలూరు పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ నుంచి వచ్చే ఊటుకూరు కాలువ గండవరం శివారులో పైడేరులో కలుస్తుంది. ఇక్కడ లాక్‌లు (ఏడు శూలాలు) ఉన్నాయి. సాగునీరు కింది ప్రాంతానికి వెళ్లకుండా వీటిని మూసేశారు. ఈ ప్రాంతంలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జి.సుబ్బారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పరిశీలించారు. మృతురాలి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆమె మూడురోజుల క్రితం బుచ్చి మండలంలోని రిజర్వాయర్ నుంచి వచ్చే వవ్వేరు కాలువ పైతట్టు ప్రాంతంలో ప్రమాదవశాత్తు పడి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అక్కడి నుంచి నీటిలో కొట్టుకుని వచ్చి లాక్‌ల వద్ద మృతదేహం నిలిచి ఉంటుందని ఎస్సై తెలపారు. ఆచూకీ తెలిసిన వారు కొడవలూరు లేదా బుచ్చిరెడ్డిపాళెం ఎస్సైలను సంప్రదించాలని ఎస్సై సుబ్బారావు సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వంతెన కల.. సాకారం దిశగా..

ఏటా కురిసే భారీ వర్షాల కారణంగా ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసరమైతే పడవ ప్రయాణమే దిక్కు. ఉప్పు కాలువపై హై లెవల్ వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా అక్కడి ప్రజలు కోరుతున్నారు. టీడీపీ మాటలు చెప్పిందే కానీ పట్టించుకోలేదు. గ్రామస్తులకు అండగా ఉంటానని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. తాజాగా రూ.13 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో గ్రామస్తుల కల త్వరలో నెరవేరనుంది.

- తీరనున్న తిరుమలమ్మపాళెం వాసుల కష్టాలు
- హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లు విడుదల
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సీఎం జగన్, మంత్రి కాకాణికి రుణపడి ఉంటామన్న గ్రామస్తులు



గ్రామానికి వెళ్లే ఉప్పు కాలువ లోలెవల్ వంతెనపై వరదనీరు (ఫైల్)

వెంకటాచలం: మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న తీర ప్రాంతమైన తిరుమలమ్మపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉప్పు కాలువ ఉంది. దీనిపై ఏళ్ల క్రితం లో లెవల్ బ్రిడ్జి నిర్మించారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో దీనిపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. కొన్ని సంవత్సరాల నుంచి నవంబర్, డిసెంబర్ నెలల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో అక్కడి ప్రజలు వరద ఉధృతి తగ్గే వరకు బయటి ప్రాంతాలకు వెళ్లాలన్నా, వేరే చోటు నుంచి గ్రామానికి చేరుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. అత్యవసరమైతే పడవ ప్రయాణం చేసి రాకపోకలు కొనసాగించాల్సిందే. రాకపోకలు నిలిచిపోయిన సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పడవలో వెళ్లి నిత్యావసర సరుకులు, వైద్యసేవలు అందించేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉప్పు కాలువపై హై లెవల్ వంతెన నిర్మిస్తామని అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రచారం చేశారు. ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

మంత్రి కాకాణి ప్రత్యేక చొరవతో..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ కారణంగా త్వరలో తిరుమలమ్మపాళెం గ్రామస్తుల కల సాకారం కానుంది. గతంలో వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయిన సందర్భంలో ఆయన పడవ ప్రయాణం ద్వారా ఆ గ్రామానికి వెళ్లేవారు. ప్రజల బాగోగులు తెలుసుకుని, అవసరమైన వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి అండగా నిలిచారు. తమ ప్రభుత్వం వస్తే వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ముత్తుకూరు మండలం నేలటూరులో సీఎం బహిరంగ సభ జరిగింది. ఈ సమయంలో మంత్రి తిరుమలమ్మపాళెం హై లెవల్ వంతెన గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వంతెన నిర్మిస్తామని సభావేదికపై నుంచి సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా రూ.13 కోట్ల నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. దీంతో గ్రామస్తుల కలల వంతెన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.



తిరుమలమ్మపాళేనికి పడవలో వెళుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

మంత్రి కాకాణికి రుణపడి ఉంటాం



తిరుమలమ్మపాళెం గ్రామస్తుల ఏళ్లనాటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. భారీ వర్షాల సమయంలో ప్రజలు పడే అవస్థలు వర్ణనాతీతం. కాకాణి సమస్యలను కళ్లారా చూశారు. ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం.. రూ.13 కోట్లు విడుదల చేయించడం సంతోషకరం.

– రౌతు మల్లికార్జున, మాజీ సర్పంచ్, తిరుమలమ్మపాళెం

సీఎంకు కృతజ్ఞతలు



తిరుమలమ్మపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉప్పు కాలువపై హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఎన్నో సంవత్సరాల నుంచి వంతెన కలగానే మిగిలిపోయింది. నిధులు మంజూరు చేయడంతో ఇక గ్రామస్తులకు వంతెన సమస్య తీరినట్లే.

– ముంగర శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, తిరుమలమ్మపాళెం

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: 'రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం. ఈ విషయాన్ని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రహించి మా పార్టీలో చేరుతున్నారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలుకు చెందిన టీడీపీ బీసీ సెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కావలి వెంకటేశ్వర్లు తన అనుచరులతో గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు చాలా బాగున్నాయని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న విధంగా ఎక్కడా కక్ష సాధింపులు లేవని గుర్తుచేశారు. కోవూరు నియోజకవర్గంలో టీడీపీ 90 శాతం వరకు ఖాళీ అయిపోయిందని ఎమ్మెల్యే అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో కరుడుగట్టిన టీడీపీ సీనియర్ నాయకులు యర్రం రెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినప్పుడు 70 శాతం, ప్రస్తుతం కావలి వెంకటేశ్వర్లు తన అనుచరులతో చేరడంతో 90 శాతం వరకు ఖాళీ అయిందన్నారు. 5 మండలాల్లో ఉన్న ఆ పార్టీ సీనియర్ నాయకులు తమకు టచ్‌లో ఉన్నారని త్వరలోనే వారిని కూడా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తామన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతోపాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రసన్న చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నాయకులు కోడూరు మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్ రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు శివకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ప్రజా సేవే నా లక్ష్యం

- సోము వీర్రాజు నిజాలు తెలుసుకోవాలి
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాస గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఇల్లు ప్రభుత్వ భూమి అని నిరూపిస్తే.. కూల్చేసి ఆ స్థలాన్ని అప్పగించడానికి సిద్ధంగా ఉన్నానని, బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఈ సవాల్‌ను స్వీకరించాలన్నారు. ఆయన నిజాలు తెలుసుకోకుండా ప్యాకేజీ తీసుకుని తనపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లను వీర్రాజుకు ఇస్తానని, అధికారుల ద్వారా నిజాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కావలిలో జగనన్న కాలనీ కోసం భూ సేకరణలో రూ.కోట్లు స్వాహా చేశానని అనడం దారుణమన్నారు. కర్ణాటకలో బీజేపీకి చెందిన నాయకులతో కలిసి వ్యాపారాలు చేశానని, సంపాదనను వదులుకుని ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయం ఆ రాష్ట్ర బీజేపీ నాయకులను అడిగితే చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు యాదవ్, కుందుర్తి శ్రీనివాసులు, కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, పానుగోటి అనురాధ, గుర్రం వెంకటేశ్వర్లు, కొమారి రాజు, కనుపర్తి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం సంక్షేమ పథకాల అమలు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 37వ డివిజన్‌లో రామ్‌నగర్ వద్ద నుంచి గురువారం సాయంత్రం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలను పక్కాగా అందిస్తున్నామన్నారు. రూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ ఆదాల

వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి



మున్సిపల్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి తదితరులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలో నిర్మించిన మున్సిపల్ బస్టాండ్‌ను శుక్రవారం సాయంత్రం పలువురు మంత్రులు, ప్రముఖులు ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. పట్టణంలో ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ ప్రారంభోత్సవ పనులను గురువారం ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, అధికారులు, పలువురు పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది జూన్ 23న జరిగిన శాసనసభ ఉపఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించారని చెప్పారు. తన సోదరుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో రూ.4.50 కోట్ల వ్యయంతో బస్టాండ్ నిర్మించి ప్రజలకు కానుకగా ఇస్తున్నట్లు తెలిపారు. దీనిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించామన్నారు. ప్రజల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారని పేర్కొన్నారు. బహిరంగ సభలో పాల్గొనే ప్రజల కోసం తాగునీరు, మజ్జిగ, సరఫరా చేసే కొంటర్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, ఏఈ జె.ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఐవీ రమణారెడ్డి, జమీర్, కలాం, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ముజీబ్ దితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

కావలిరూరల్: విద్యుదాఘాతానికి గురై జలదంకి నరసింహారావు (36) అనే టిప్పర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన గురువారం కావలి రూరల్ మండలంలో జరిగింది. రూరల్ ఎస్సై వెంకట్రావు కథనం మేరకు.. జలదంకి మండలం రామవరప్పాడు గ్రామానికి చెందిన నరసింహారావు ఉలవపాడు మండలం మన్నేటికోటకు చెందిన ఈశ్వర్‌కుమార్ అనే వ్యక్తి దగ్గర టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం చెన్నాయపాళెంలో టిప్పర్‌లో మట్టి లోడ్ చేసుకుని బీచ్ రోడ్డు వద్దకు వెళ్లాడు. మట్టి అన్‌లోడ్ చేస్తుండగా విద్యుత్ తీగలు వాహనానికి తగిలాయి. ఈ సమయంలో లోపలున్న నరసింహారావు షాక్‌కు గురయ్యాడు. అతడిని 108 అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నరసింహారావుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	155
లేయర్ (లైవ్)	108
బ్రాయిలర్ చికెన్	262
బ్రాయిలర్ స్కిన్ లెస్	292
లేయర్ చికెన్	184

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.35
సన్నవి	రూ.20
పండ్లు	రూ.7

సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 23 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 32.467 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం రావడం లేదు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,440
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,428
3 శాతం జీఎస్టీతో	రూ.5,591
నవర (8 గ్రాములు)	రూ.44,728

గరిష్టం/కనిష్టం
36.5 /28.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైంది. గాలిలో 53 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

ట్రావెల్స్ బస్సులపై కేసుల నమోదు

- రూ.30 లక్షల అపరాధ రుసుం విధింపు



బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ బాలమురళీకృష్ణ

నెల్లూరు (టౌన్): ఎలాంటి పన్ను చెల్లించకుండా తిరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఆదేశాల మేరకు అధికారులు నగర పరిధిలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న పలు ట్రావెల్స్ బస్సుల పత్రాలు పరిశీలించగా, నాలుగు బస్సులు త్రైమాసిక పన్ను చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. ఒక్కో వాహనం నుంచి సుమారు రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.24 లక్షల మేర పన్నుతో పాటు అపరాధ రుసుం విధించారు. అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పలు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి వాటిపై రూ.6 లక్షల మేర అపరాధ రుసుం విధించారు. మొత్తం రూ.30 లక్షల మేర వసూలు చేయనున్నారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలో బాలమురళీకృష్ణ, గోపినాయక్ రాంబాబు, సుందరరావు, కార్తీక్ పవన్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకున్నాం

- ఆర్డీఓ శీనానాయక్

కావలి : నకిలీ ఐడీతో జరుగుతున్న భూ రిజిస్ట్రేషన్ను అడ్డుకున్నట్లు ఆర్డీఓ శీనానాయక్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జనతాపేట వద్ద ఉండే మీసేవా నిర్వాహకుడు మురళి అనే వ్యక్తి రూరల్ పరిధిలోని చెన్నాయపాలెంలో దాదాపు 12 ఎకరాల భూమిని వారసత్వ సంపద కింద నకిలీ పత్రాలతో మ్యూటేషన్ కోసం రెవెన్యూ శాఖకు పంపారని, దీనిని వారు గుర్తించి తమ దృష్టికి తీసుకురావడంతో నకిలీ ఐడీలను గుర్తించామని తెలిపారు. ఈ వ్యవహారంలో మీసేవా కేంద్రాన్ని సీజ్ చేశామని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీఎస్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి
- కుటుంబసభ్యుల ఆందోళన
- ఎస్సై, రైటర్ సస్పెన్షన్



సైదాపురం పీఎస్‌లో విచారణ జరుపుతున్న నెల్లూరు ఆర్డీఓ

సైదాపురం: పోలీస్‌స్టేషన్‌లో పురుగు మందు తాగి రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. దీంతో మృతుడి బంధువులు ఎమ్మార్పీఎస్ నేతల ఆధ్వర్యంలో సైదాపురం పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. రాపూరు మండలంలోని అక్కమాంబాపురానికి చెందిన వంగపాటి ఆకాష్‌రాం(22) ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న కేసులో విచారించేందుకు పోలీసులు మంగళవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న పురుగు మందును ఆ యువకుడు తాగాడు. వెంటనే అతన్ని గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. గతంలో ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె తాగిన పురుగు మందును పోలీసులు తీసుకొచ్చి స్టేషన్‌లో ఉంచారు. ఆకాష్‌రాం కూడా ఆ మందు తీసుకుని తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయాడు.

బాధ్యులపై చర్యలు

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సై పి.నాగబాబు, స్టేషన్ రైటర్ వీరభద్రను సస్పెండ్ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి చెప్పారు. కేసుపై విచారణ కమిటీ వేశామని, దీనిలో నెల్లూరు ఆర్డీవో మలోల, కావలి డీఎస్పీ వెంకటరమణ ఉంటారన్నారు. నివేదిక అందాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన సొంత నిధులతో ఆధునిక హంగులతో బస్టాండ్‌ను తీర్చిదిద్దారు. తన సోదరుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయ సాధనలో భాగంగా బస్టాండ్ సముదాయాన్ని నిర్మించారు. దీనిని శుక్రవారం ఆత్మకూరు ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సముదాయాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు రానున్నారు.

నూతన బస్టాండ్ సముదాయం



ఆత్మకూరుకు ఐకానిక్ బస్టాండ్

ఎంజీఆర్ ఫౌండేషన్ నిధులతో నిర్మాణం

- సొంత నిధులు వెచ్చించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- నేడు మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు పట్టణాభివృద్ధి, సుందరీకరణలో భాగంగా మున్సిపల్ బస్టాండ్ నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నడుం బిగించారు. ప్రధానంగా శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను పునర్నిర్మించి సకల సౌకర్యాలు కల్పిస్తే పట్టణాభివృద్ధి వేగవంతం అవుతుందని భావించారు. వెనువెంటనే ఎంజీఆర్ ఫౌండేషన్ ద్వారా సొంత నిధులు వెచ్చించి ఆధునిక టెక్నాలజీతో ఆర్టీసీ బస్టాండ్ సముదాయాన్ని నిర్మించి, జిల్లాలోనే రోల్ మోడల్‌లా నిలిపారు.



ఆత్మకూరు మున్సిపల్ పాత బస్టాండ్ భవనం (ఫైల్)

ప్రయాణికుల రాకపోకలు ఇలా..

ఆత్మకూరు బస్టాండ్ నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు బస్సులు 172 ట్రిప్పులు వెళ్తుంటాయి. 60 సర్వీసులు జిల్లా నలుమూలలకు మాత్రమే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సైతం వెళ్తుంటాయి. ప్రతిరోజు వేలల్లో ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. రోజు వారీగా రూ.10 లక్షల వరకు చార్జీల రూపంలో వస్తుంది. ఆత్మకూరు నుంచి దాదాపు 50 గ్రామాల వారు నిత్యం వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాక ఇతర జిల్లాల నుంచి కూడా ఆత్మకూరుకు రాకపోకలు చేస్తారు.

ఎమ్మెల్యేగా ఏడాది

మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా తొలి ఏడాది పూర్తి చేసుకున్నారు. రాజకీయ అనుభవం లేకున్నా విద్యావంతుడు కావడంతో ఏడాదిలోనే తన మార్క్ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు బీజం వేశారు. ముందుగా ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఏడీఎఫ్)కు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జన్మించి వివిధ దేశాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచిన వ్యక్తులతో పాటు వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదిగిన వారితో ఏడీఎఫ్‌ను ప్రకటించి ఒక్కో పని పూర్తి చేస్తున్నారు. అందరి కంటే ముందుగా తమ కుటుంబం నుంచే రూ.10 కోట్ల నిధులను ఏడీఎఫ్ కోసం అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా తన సోదరుడు, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు ప్రజలకు ఇచ్చిన హామీని మర్చిపోకుండా మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం పూర్తి చేశారు.

అభివృద్ధికి ప్రణాళికలు

నియోజకవర్గంలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం ముగిసేలోపు వంద పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే నియోజకవర్గంలో జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మరోసారి ఈనెల 24న కూడా జాబ్‌మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గొప్ప నిర్ణయం



ఆత్మకూరు పట్టణ వాసులకు చిరస్థాయిగా నిలిచిపోయేలా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మున్సిపల్ బస్టాండ్ నిర్మించడం గొప్ప నిర్ణయం. ఐకాన్‌లా నిర్మించిన బస్టాండ్‌లో అన్ని సౌకర్యాలతో ప్రయాణికులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా కోట్లాది రూపాయలతో నిర్మించడం ఆనందదాయకం.

– టి.తిరుపతమ్మ, లాయర్, 13వ వార్డు కౌన్సిలర్, ఆత్మకూరు

ఆదర్శంగా నిలిచారు



గెలిచిన ఏడాదిలోపే ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఎంజీఆర్ ఫౌండేషన్, ఏడీఎఫ్ ద్వారా సొంత నిధులు వెచ్చించి బస్టాండ్ నిర్మించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా ప్రజలకు మేలు చేయాలనే మంచి ఆలోచనతో బస్టాండ్ నిర్మించి అందుబాటులోకి తేవడం సంతోషదాయకం.

– పి.పెంచలయ్య, 14వ వార్డు కౌన్సిలర్, ఆత్మకూరు

బస్టాండ్ ప్రత్యేకతలు

- రూ.4.5 కోట్ల వ్యయంతో బస్టాండ్‌ను నిర్మించారు.
- బస్టాండ్ ఎంట్రెన్స్‌లో ఐకానిక్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేశారు.
- 120 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను తట్టుకునేలా నిర్మాణం.
- ఎనిమిది బస్సులు ఒకేసారి నిలిచేలా ప్లాట్ ఫారాల నిర్మాణం.
- దుకాణాలకు 31 గదుల నిర్మాణం.
- వెలుతురు బాగా వచ్చేలా సీలింగ్ గ్లాస్ ఫిట్టింగ్ ఏర్పాటు చేశారు.
- అతి త్వరలో ప్రయాణికుల కోసం వైఫై సదుపాయం.
- బస్టాండ్ ఆవరణలో గౌతమ్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.
- బస్టాండ్‌లో సిమెంట్‌రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీలు నిర్మించారు.



ఆత్మకూరు రుణం తీర్చుకుంటా



తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఆత్మకూరు ప్రజల రుణాన్ని తీర్చుకుంటా. ఆత్మకూరుకే ఐకాన్ లాంటి మున్సిపల్ బస్టాండ్‌ను తన సోదరుడు దివంగత గౌతమ్‌రెడ్డి పేరు మీద ఫౌండేషన్ ద్వారా నిర్మించాను. నియోజకవర్గంలో అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాం. రాబోయే ఏడాదిలో వీటిని పూర్తి చేసేందుకు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంను ఏర్పాటు చేశాను. రాజకీయాలతో సంబంధం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ వారి అభివృద్ధికి దోహదపడుతున్నా.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఆత్మకూరు

అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్ పాల్గొన్న అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట) : 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల్లో గత వారం వచ్చిన దరఖాస్తులు, వాటిపై అధికారులు స్పందించిన తీరు గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. ఇందుకు ప్రతి శాఖకు కేటాయించిన నోడల్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై సమీక్ష

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు వర్చువల్‌గా ప్రారంభిస్తారని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, గ్రామ, వార్డు సచివాలయాల సందర్శనలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం రెండూ ఒకదానికొకటి అనుసంధాన కార్యక్రమాలు అని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పరిష్కారమైతే జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్జీదారులకు తెలియజేయాలన్నారు. లేకుంటే ఎందుకు పరిష్కారం కాలేదో వివరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత



మొక్కలు నాటే కార్యక్రమంలో వీసీ తదితరులు

వెంకటాచలం: మొక్కలు నాటడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ముత్తుకూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం గురువారం చేపట్టారు. దీనిని వీసీ ప్రారంభించి, మాట్లాడారు. పది ఎకరాల విస్తీర్ణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి ఎస్‌ఈఐఎల్ ముందుకు రావడం చాలా సంతోషకరమన్నారు. రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, ఎస్‌ఈఐఎల్ ప్రతినిధులు రెడ్డెయ్య, శ్రీధర్, వీఎస్‌యూ ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధితో ఉద్యోగావకాశాలు

- సర్వేపల్లిలో రూ.925 కోట్లతో పరిశ్రమల ఏర్పాటు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్
- భూమిపూజలో పాల్గొన్న మంత్రి కాకాణి



బయో ఇథనాల్ ప్లాంట్‌లకు శంకుస్థాపన చేసిన మంత్రి కాకాణి, కలెక్టర్ హరినారాయణన్ ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణ్ చక్రవర్తి తదితరులు

వెంకటాచలం: రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధితో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం సర్వేపల్లిలో రూ.925 కోట్లతో ఏర్పాటు చేయనున్న క్రిబ్కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, విశ్వ సముద్ర బయో ఇథనాల్ పరిశ్రమలకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ రెండు పరిశ్రమలతో 1,150 మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చెప్పారు. స్థానికంగా భూమిపూజ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమల ఏర్పాటును స్వాగతిస్తున్నారని చెప్పారు. క్రిబ్కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.610 కోట్లతో బయో ఇథనాల్ ప్లాంట్, విశ్వ సముద్ర ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.315 కోట్లతో ఏర్పాటు కానున్న బయో ఎనర్జీ ప్లాంట్లకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. క్రిబ్కో కంపెనీకి ఈ భూములు కేటాయించే సమయంలో తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నానని, ఆ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం విషయంలో కోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా కృషి చేశానని గుర్తు చేశారు. అనేక ఇబ్బందులు దాటుకుని ప్రస్తుతం పరిశ్రమలు ఏర్పాటు కావడం ఈ ప్రాంత ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, క్రిబ్కో బయో ఇథనాల్ ప్లాంట్ డైరెక్టర్లు వీఎస్‌ఆర్ ప్రసాద్, ఎంఆర్ శర్మ, విశ్వ సముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ డైరెక్టర్ వేణుగోపాల్, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

పకడ్బందీగా జగనన్న సురక్ష

- ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల గుర్తింపు
- ఒకటి నుంచి సచివాలయాల పరిధిలో సర్టిఫికెట్ల పంపిణీ
- మండలానికి రెండు బృందాలు

నెల్లూరు (దర్గామిట్ట), నెల్లూరు(పొగతోట) : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈనెల 23వ తేదీన కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం అవుతుంది. వారం రోజుల పాటు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు వివరిస్తారు. జూలై 1వ తేదీ నుంచి శిబిరాలను ఏర్పాటు చేసి వారికి కావాల్సిన సేవలను అందిస్తారు.

జిల్లాలో..

జిల్లాలో 549 గ్రామ సచివాలయాలు, 220 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో కార్యక్రమం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ శిబిరాల ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందజేయనున్నారు. నాలుగు వారాల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జగనన్నకు చెబుదాంకు అనుబంధంగా అన్నిరకాల ప్రజా వినతులను పరిష్కరించడానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే శిబిరాల్లో వలంటీర్లతో పాటు సచివాలయాల సిబ్బంది శనివారం నుంచే ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం గురించి వివరిస్తారు. అంతే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీకి వినతులను కూడా సేకరిస్తారు. తహసీల్దార్, ఎంపీడీఓలతో సహా వివిధ మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. క్యాంపుల నిర్వహణ సమయంలో వినతుల స్వీకరణ, పరిష్కారం కోసం రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్వీసు రిక్వెస్టు డెస్క్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేస్తారు. ఆయా డెస్కుల్లో మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది వారివారి బాధ్యతలను నిర్వర్తిస్తారు.

సచివాలయ పరిధిలో..

గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపుల నిర్వహణ కోసం మండలాల వారీగా ఎంపీడీఓ, తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసి, ప్రతి బృందంలో ముగ్గురేసి మండల స్థాయి అధికారులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. జగనన్న సురక్షకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారుల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుంది. సచివాలయం పరిధిలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంపై ముందుగా ఆయా గ్రామాల్లోని ప్రజలకు తెలిసేలా తగిన చర్యలు తీసుకోనున్నారు. మ్యుటేషన్ ఆఫ్ ట్రాన్సాక్షన్‌కు సంబంధించి పాసు పుస్తకాల జారీకి దరఖాస్తుదారు చెల్లించాల్సిన చార్జీలను మాత్రం వసూలు చేస్తారు.



అనంతసాగరం మండలం బొమ్మవరం సచివాలయం

సర్వీసు చార్జీలు లేకుండా అందించే సేవలివే

- ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్
- మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ (భూ కొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు), మ్యుటేషన్ ఫర్ కరక్షన్స్ (భూ వివరాల నమోదులో మార్పులు)
- వివాహ ధ్రువీకరణ పత్రం (పట్టణ ప్రాంతాల్లో 90 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు)
- ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు
- ఆధార్‌తో మొబైల్ నంబర్ అప్‌డేట్
- కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ)
- కొత్త రేషన్‌కార్డు, రేషన్‌కార్డు విభజన
- ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొందరి సభ్యుల పేర్ల తొలగింపు

ఉచితంగా సర్టిఫికెట్లు



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీ నుంచి సర్వే నిర్వహించనున్నాం. వచ్చే నెల నుంచి సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

పైలట్ ప్రాజెక్టుగా పిడూరులో..

మనుబోలు మండలం పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారు. గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి అవసరమైన సర్టిఫికెట్లను మంజూరు చేశారు. పిడూరు సచివాలయ పరిధిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ సభకు 424 మంది ప్రజలు హాజరయ్యారు. 842 అర్జీలను అధికారులు స్వీకరించారు. క్యాస్ట్ 344, ఇన్‌కమ్ 349, ఆధార్ 140, మ్యారేజ్ సర్టిఫికెట్ 5, భూ సమస్యలపై నాలుగు దరఖాస్తులు వచ్చాయి. ఆధార్‌కు ఫోన్ లింక్ తదితర 140 సమస్యలను పరిష్కరించారు. వివిధ సర్టిఫికెట్లకు సంబంధించి 695 సమస్యలను పరిష్కరించి అందజేశారు. ఏడు సర్టిఫికెట్ల సమస్యలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.